క్లుప్తంగా

భగవద్గీత పోటీలో విజేతలకు సన్మానం



పెడన: గణపతి సచ్చిదానంద స్వామీజీ 83వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన భగవద్గీత పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన విజేతలను శుక్రవారం ఆయా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పట్టణ ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థలైన ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి మహిళా మండలి పొట్టి శ్రీరాములు తదితర స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట ప్రసాదరావు అధ్యక్షత వహించారు. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్న) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఘంటసాలలో భారీ వర్షం



ఘంటసాల: ఘంటసాల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ఘంటసాల–రామానగరం ప్రధాన రహదారి సాయిబాబా గుడి దగ్గర జలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘంటసాల– అంబేడ్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కూడా నీరు నిలిచిపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పలేదు.

వరి మద్దతు ధరపై రైతుల నిరసన



బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరల్లో వరి ధాన్యానికి సరైన ధర ప్రకటించలేదంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మినుములు తదితర పంటలకు వందల్లో ప్రకటించి వరి పంటకు కేవలం రూ.69 పెంచడం దారుణమని విమర్శించారు. పెట్టుబడులు పెరిగిపోయి వ్యవసాయం భారంగా మారుతున్న క్రమంలో ప్రభుత్వాలు సహకరించడంలేదన్నారు. క్వింటాల్‌కు రూ.3200 పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు రైతుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇచ్చి ఆదుకుంటున్నాయని రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లేశ్వరం నీటి సంఘం అధ్యక్షుడు కె.మురళీమోహన్, బంటుమిల్లి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్దన్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతు సంఘ మండల అధ్యక్షుడు ఎల్.అజయ్‌ఘోష్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపిస్టులపై కఠినంగా వ్యవహరించాలి

అవనిగడ్డ: అత్యాచారాలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య హృదయ విదారకరమన్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి గ్రామంతో పాటు మండలంలోని 33 రేషన్ షాపులను మండల తహసీల్దార్ బి.విజయప్రసాద్‌తో కలసి మొవ్వ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ (పీడీఎస్) కొడాలి శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మొవ్వ డివిజన్ పరిధిలోని ఘంటసాల మండలంలో 33, చల్లపల్లి మండలంలో 35, మొవ్వ మండలంలో 38 రేషన్ షాపులను తనిఖీ చేసినట్లు చెప్పారు.

ఖరీఫ్ సాగుకు రైతులకు సూచనలు

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మేళ్లమర్తిలంక గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఘంటసాల ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు ముందుగా చేయాల్సిన పనులు, మట్టి నమూనా పరీక్షలు, భూమి ఆరోగ్యానికి అనుగుణంగా పోషక యాజమాన్యం, కొత్త వంగడాలు, యాంత్రీకరణ, పంటల యాజమాన్యం, సస్యరక్షణ, నూతన సాంకేతిక పరిజ్ఞానం, పాడిపశువుల యాజమాన్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేసే సబ్సిడీలు, వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం వంటి అంశాలను రైతులకు వివరించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై పోరుకు సిద్ధం కండి

- జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని



సమావేశానికి హాజరైన కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను నెరవేర్చకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బందులపాలు చేస్తున్న టీడీపీ కూటమి పాలనపై పోరుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పిలుపునిచ్చారు. స్థానిక ఇనకుదురుపేటలోని ఎంఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పేర్ని నాని మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆచరణ సాధ్యం కాని పలు పథకాలను ప్రకటించి ప్రజలను దగా చేశారన్నారు. అధికారం చేపట్టిన అనంతరం సంక్షేమ పాలనను పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు అక్రమ కేసులు వంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. జూన్ 4వ తేదీన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 9 గంటలకు కార్యకర్తలు జిల్లా కోర్టు సెంటర్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయానికి విచ్చేయాలన్నారు. అక్కడనుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డిప్యూటీ మేయర్ లంక సూరిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్ దాదా, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ జన్ను రాఘవరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అచ్చెబా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకె వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా చలనం లేదు!

- అనధికార మినుము నిల్వలపై ఫిర్యాదు
- కనీస తనిఖీలు చేయని అధికారులు

పెడన: సార్...మండలంలోని కాకర్లమూడి గ్రామంలో ఒకరి ఇంట్లో 200 వరకు మినుము బస్తాలను రహస్యంగా దాచి ఉంచారని, రైడ్ చేయాలంటూ పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్‌కు రెండు రోజులు కిందట ఫిర్యాదులు వెళ్లాయి. రైడ్ చేసే అధికారం తమకు లేదని, సివిల్ సప్లయి వారికి చెప్పానని, అయితే వారు కూడా తమ పరిధి కాదని, మార్కెటింగ్ వారికి సంబంధించినదని చెప్పడంతో మార్కెటింగ్ వారికి సమాచారం ఇచ్చానని తహసీల్దారు ఫిర్యాదుదారుడికి తెలియజేశారు. ఇక్కడవరకు బాగానే ఉంది. ''ఇదిగో...అదిగో...వచ్చేస్తున్నాం ..మా ఉన్నతాధికారులు కూడా వస్తున్నారు'' అంటూ మార్కెటింగ్ శాఖ అధికారులు కాలయాపన చేశారు. తహసీల్దారు నుంచి సమాచారం తీసుకున్నారు. రెండు రోజులు గడిచిపోయాయి. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఫోన్ చేస్తే అక్కడ సరుకు ఏమీ లేదని మార్కెటింగ్ శాఖ వారు పేర్కొనడం అనేక సందేహాలకు తావిస్తోంది. కనీసం రెవెన్యూ సిబ్బందిని వెంట బెట్టుకుని వెళ్లకుండా నేరుగా మార్కెటింగ్ శాఖ వారు పరిశీలించామని, సరుకు ఏమీ లేదని, రాత్రికి రాత్రే తరలించేశారని మార్కెటింగ్ అధికారులు రెవెన్యూ వారికి తెలియజేయడంతో ఫిర్యాదు చేసిన వారు కంగు తిన్నారు. మార్కెటింగ్ శాఖ వారు రైడ్ చేశారా లేక సమాచారం లీకు చేసి తప్పించుకునేలా చేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మినుము బస్తాల లారీలు రాత్రికి రాత్రే తరలివెళ్లాయని చుట్టు పక్కల గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై పెడన వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి అశ్విన్‌ను వివరణ కోరగా అక్కడ అలాంటి పరిస్థితి లేదని వీఆర్వో చెప్పడంతో తాము అసలు రైడ్‌కి వెళ్లలేదన్నారు. వీఆర్వో ఏమైనా తప్పుదోవ పట్టించారేమోననే సందేహం వ్యక్తం చేయడం గమనార్హం.

ప్రతిష్ఠోత్సవాలకు పంచముఖి ఆంజనేయుడు ముస్తాబు



పురవీధుల వెంట ఊరేగుతున్న పంచముఖి ఆంజనేయుడు

కోడూరు: మండలంలోని జరుగువానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామివారి ఆలయం ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబయింది. గ్రామంలోని రత్నకోడు వంతెన పక్కన సుమారు రూ.30 లక్షల వ్యయంతో నూతన ఆంజనేయ స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. శనివారం నుంచి ఆలయంలో ప్రతిష్ఠోత్సవ పూజలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. తొలిరోజు పుణ్యాహవాచన, మాతృకాపూజనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశన, యాగశాలా సంస్కారం, దీక్షా హోమాలను నిర్వహించనున్నారు. 1వ తేదీన గోపూజ, మంటపదేవతార్చన, దీక్షాహోమం, ధాన్యాధివాసం, పుష్పాదివాసాలను జరపనున్నారు. 2వ తేదీన గణపతి, దక్షిణామూర్తి విగ్రహాలతో పాటు పంచముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వీటితో పాటు ధ్వజ, శిఖర ప్రతిష్ఠలు కూడా ఉంటాయన్నారు. ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహాన్ని పురవీధుల వెంట ఊరేగిస్తున్నారు.

సెక్యూరిటీ గార్డు దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఓ సెక్యూరిటీ గార్డు తండ్రీకొడుకులపై దాడికి పాల్పడ్డాడు. అందరి ఎదుట జరిగిన అవమానాన్ని తట్టుకోలేని బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. దాడికి పాల్పడిన సెక్యూరిటీ గార్డుపై ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంటుమిల్లి మండలం బాసినపాడు గ్రామానికి చెందిన భట్రాజు శ్రీరాములు, నాంచారమ్మ వ్యవసాయ కూలీలు. గురువారం రాత్రి నాంచారమ్మ బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవటంతో నడుం మీద బలమైన దెబ్బ తగిలింది. లేవలేని స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీరాములు, కుమారుడు అయ్యప్ప కలిసి బైక్‌పై బయటికి వెళ్లి మెస్ నుంచి భోజనం తెచ్చుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఓపీ విభాగానికి ఎదుట బైక్ పార్కింగ్ చేసి లోనికి వెళ్లే క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీగార్డు కిరణ్ బైక్‌ను అక్కడి నుంచి తీసి పార్కింగ్ ప్రదేశంలో పెట్టుకోవాలంటూ చెప్పాడు. క్యారేజీ లోపల పెట్టి వెంటనే బైక్‌ను అక్కడి నుంచి తీసేస్తానంటూ అయ్యప్ప బదులిచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన సెక్యూరిటీ గార్డు అయ్యప్ప పట్ల దురుసుగా వ్యవహరిస్తూ బైక్‌ను వెంటనే తీయాలంటూ ఆదేశించాడు. ఇరువురి మధ్య వాదన పెరిగి సెక్యూరిటీగార్డు కిరణ్ సమీపంలో ఉన్న ఇటుక రాయితో అయ్యప్పను కొట్టేందుకు ప్రయత్నించాడు. తండ్రి నాగేశ్వరరావు ఇరువురిని సముదాయిస్తూ కిరణ్ చేతిలో ఇటుక రాయిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా తండ్రీకొడుకులిద్దరికీ గాయాలయ్యాయి. దీనిపై వారు మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థి కిట్లలో పాఠ్యపుస్తకాలు పంపిణీ



హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో–2 హరనాథ్

పెడన: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ల పంపిణీలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు భట్ల జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లోని స్టాకు పాయింట్ వద్ద కిట్లలో ఉండే పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఎంఈవో–2 వైవీ హరనాథ్ మాట్లాడుతూ జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంతో ఆయా పాఠశాలలకు కిట్లను అందిస్తున్నామని తెలిపారు. కిట్లలో ఉండే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూస్, స్కూలు బ్యాగ్ తదితర వాటిని వచ్చిన వాటిని వచ్చినట్లుగా హెచ్‌ఎంలకు అందజేస్తున్నామని తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మండలంలో కిట్లు అందుకోవాల్సిన విద్యార్థులు 3,592 మంది ఉన్నారని తెలిపారు. 15,008 ఇంగ్లిష్ మీడియం, 2,920 తెలుగు మీడియం, 662 ఉర్దూ మీడియం మొత్తం 18,590 పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేసి కొన్ని సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారని, విద్యార్థులు బరువులు మోసే సంచి – పుస్తకాల సంఖ్య తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు ఉన్నారు.

జూన్ 1 నుంచి సరుకులు రేషన్ షాపులోనే తీసుకోవాలి

చల్లపల్లి: రేషన్ పంపిణీ వాహనాలు రద్దయిన కారణంగా జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు రైషన్ షాపునకు వెళ్లి తీసుకోవాలని తహసీల్దార్ డి.వనజాక్షి శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని రేషన్ షాపులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటాయని తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, శారీరక దివ్యాంగులు ఉంటే వారికి ఇళ్ల వద్దకే రేషన్ డీలరు వచ్చి సరుకులు ఇస్తారని పేర్కొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం

పెడన: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని ఐదో వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి కనకదుర్గ స్పష్టం చేశారు. కిశోర వికాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఐదో సచివాలయం పరిధిలోని బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి: స్థానిక గ్రామీణ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న వెంట్రప్రగడ నాగబాబు, ప్రవల్లిక దంపతుల పెద్ద కుమారుడు హేర్వాన్ష్ రెండవ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పార్వతమ్మ తోటలోని కోట వెంకట సుబ్బారావు ఆదరణ గృహంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాగబాబు కుటుంబ సభ్యులతో పాటు, విశ్రాంత లైబ్రేరియన్ చాపరాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవితకు కిశోరి వికాసం

కోడూరు: యుక్త వయస్సు బాలికలు, మహిళల ఉజ్వల భవితకు కిశోరి వికాసం కార్యక్రమం ఉపయుక్తమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక వీవర్స్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై వేసవి తరగతులను నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్, మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, సచివాలయ సిబ్బంది రక్తదానం

పెడన: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్ కుమార్ ప్రారంభించారు. మండలంలోని వీఆర్వోలు, గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎంఈవో–2 వైవీ హరనాథ్, రెడ్‌క్రాస్ డాక్టర్ శివప్రసాద్, పెడన పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అమలేశ్వరి దేవి ఉత్సవాలు

పెడన: మండల పరిధిలోని దావోజిపాలెంలో ఉన్న అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. 11 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22న ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక ప్రదర్శనలు చేస్తున్నారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి చలి నైవేద్యం సమర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లిలో జరుగుతున్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా కృత్తివెన్ను, లక్ష్మీపురం సబ్‌స్టేషన్‌లకు సరఫరా అయ్యే 33 కేవీ లైన్‌ను నిలిపివేస్తున్నామన్నారు.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వృద్ధులకు, వికలాంగులకు మాత్రమే ఇంటికి రేషన్

పెడన: మండలంలో 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు మాత్రమే రేషన్ సరుకులను డీలర్లు ఇంటికి తీసుకువచ్చి ఇస్తారని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి అందరూ రేషన్ దుకాణాల్లోనే సరుకులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని, ఆయా సమయాల్లో తెల్లరేషన్‌కార్డు దారులు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని తెలిపారు.

నేటి నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

గూడూరు: జూన్ 1 వ తేదీ ఆదివారం కావడంతో మండల పరిధిలోని లబ్ధిదారులకు శనివారమే సామాజిక పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోటేపల్లి వనజ తెలిపారు. మండలలో మొత్తం 8131 మంది లబ్ధిదారులుండగా వీరికి పంపిణీ చేయాల్సిన నగదు రూ.3,58,16,500 శుక్రవారం సచివాలయ సిబ్బందికి అందజేసినట్లు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచే సచివాలయ సిబ్బంది గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. పెన్షన్లు తీసుకుంటూ భర్త చనిపోయిన వితంతువులకు మంజూరు చేసిన పింఛన్లను జూన్ 12న పంపిణీ చేస్తామని తెలిపారు. తద్వారా మండల పరిధిలో 129 మంది వితంతువులకు కొత్తగా లబ్ధి చేకూరనున్నట్లు ఆమె వెల్లడించారు.

1 నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

మోపిదేవి: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారానే ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు అందజేస్తారని తహసీల్దార్ శ్రీవిద్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 1 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8–12 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 8 గంటల మధ్య రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చునని తెలిపారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, వికలాంగులకు మాత్రమే 1వ తేదీ నుంచి 5వ తేదీ లోగా వారి ఇళ్ల వద్దకు పంపిణీ జరుగుతుందన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు ఘన నివాళి

పెడన: బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పెడన వాసవి ప్రార్థన మందిరంలో రాజమాత, పవిత్రమూర్తి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు జూపూడి రంగరాజు, పంతంగజేంద్ర, కొఠారి మురళీధర్ బాబు, శనక్కాయల లీలాకుమారి, పత్తిపాటి రమణ, కొల్లూరి రాధాకృష్ణ, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

యోగ సాధన ద్వారా ఆరోగ్యం

మోపిదేవి: యోగ సాధన ద్వారా ఆరోగ్య ప్రమాణాలు పెరుగుతాయని యోగ మాస్టర్ నాగరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్వాసప్రక్రియ, యోగనిద్ర వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాథ్, ప్రసాద్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

మచిలీపట్నంటౌన్: సీఐటీయు 55వ ఆవిర్భావ దిన వేడుకలు శుక్రవారం నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక కోనేరు సెంటర్లో పెద్ద ముఠా హమాలీల కార్యాలయంలో సీఐటీయూ జెండాను సంఘ కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరువోలు జయరావు ముఠా కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీఐటీయూ మండల అధ్యక్షురాలు బొర్రా రత్నకుమారి కార్మిక జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నగర కమిటీని ప్రకటించిన పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నగర కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) శుక్రవారం ప్రకటించారు. స్థానిక ఇనకుదురుపేట లోని ఎంఆర్ కల్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన నగర కమిటీని ప్రకటించారు. అధ్యక్షునిగా కార్పొరేటర్ మేకల సుధాకర్ (సుబ్బన్న), ఉపాధ్యక్షులుగా కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాదు, షేక్ మహమ్మద్ సాహెబ్, మాజీ కౌన్సిలర్ కొలుసు హరిబాబు పేర్లను ఆయన ప్రకటించారు. వైఎస్సార్ సీపీ నగర కమిటీలో స్థానం పొందిన నాయకులకు కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.